



పరవాసుదేవ అలంకరణలో శ్రీవారు

దేవదేవంభజే

6

» ఘనంగా ప్రారంభమైన వాడపల్లి బ్రహ్మోత్సవాలు



చుక్కలనంటిన వెండి ధర!

కిలో రూ. 1,72,000.. రూ.2 లక్షలవుతుందని అంచనా

మార్కెట్‌లో పెరిగిన కొనుగోళ్లు.. 9 నెలల్లో రెట్టింపు

బంగారమూ పరుగే.. 22 క్యారెట్ 1,13,400

24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.1,23,710

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండిపై మోజు పెరిగే కొద్దీ వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. బంగారం ధరలు వినియోగదారులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. అదే బాటలో వెండి సైతం రికార్డులు సృష్టిస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో కిలో వెండి ధర అనూహ్యంగా పెరిగి రూ.1,72,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ తొమ్మిది నెలల పదిరోజుల్లో ఏకంగా రెట్టింపు అయింది. త్వరలో కిలో వెండి రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్గెట్ వర్గాల అంచనా. రేట్లు రోజుకురోజుకు పెరుగుతుండడంతో వెండి కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. భవిష్యత్ అవసరాల కోసం ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇక బంగారం ధరలు ఇప్పటికే చాలావరకు దూసుకెళ్లాయి. బంగారం ఇక సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని వస్తువుగా మారిపోతుందేమో అనే రీతిలో ధరలు పెరిగిపోయాయి. ఆగస్టు 29న 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94,700గా ఉంది. రాజమండ్రి మార్కెట్‌లో గురువారం నాటికి 22 క్యారెట్ ధర రూ.1,13,800కు పెరిగింది. శుక్రవారం 400 తగ్గి రూ.1,13,400 వద్ద నిలబడింది. 24 క్యారెట్ బంగారం ధర 1,23,710గా ఉంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి 22 క్యారెట్ ధర కేవలం 71,150గా ఉంది. 24 క్యారెట్ బంగారం ధర రూ.78వేలు మాత్రమే. ప్రస్తుత ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళనతో వెండి కిలో బార్లు, క్వాయిన్లు, బంగారం బిస్కట్ రూపంలోనూ కొందరు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం.

‘రుణం’ లేదేమో!

» ఐదు నెలలుగా నిలిచిపోయిన బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలు
» యూనిట్ల సంఖ్య పెంపు పేరుతో మంజూరైనవి మే నెల నుంచి నిలిపివేత
» అసలెప్పుడు మంజూరవుతాయో తెలియక లబోదిబోమంటున్న లబ్ధిదారులు
» అటు నియోజకవర్గాల్లో సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యేలూ సతమతం
» ఉమ్మడి జిల్లాలో 2,405 బీసీ కార్పొరేషన్ యూనిట్లకు 32,448 దరఖాస్తులు రాక
» ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 2,732 యూనిట్లకు 13,317 దరఖాస్తులు
» నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకూ లేని అధికారుల తీరుతో నిరుద్యోగుల్లో బెంగ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల కింద నిరుద్యోగులకు ఇచ్చే స్వయం ఉపాధి యూనిట్లకు గ్రహణం పట్టింది. అప్పటి సీఎం జగన్ ఆనవాయితీగా వస్తోన్న రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం తరపున స్వయం ఉపాధి పొందే అవకాశం లేక ఎందరో పేదలు నష్టపోయారు. అయితే ప్రభుత్వం మారాక మళ్లీ బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు మంచిరోజులు వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఆగిపోయిన రుణాలను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఆరంభంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి యూనిట్లను ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. ఈ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు అప్పగించింది. నిరుద్యోగులకు లాభదాయకంగా ఉంటే స్వయం ఉపాధి యూనిట్లను అధికారులు గుర్తించి మంజూరుచేయాలని ఆదేశించింది. ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో ప్రభుత్వం నలభైశాతం, బ్యాంకు రుణం అరవై శాతం వచ్చేలా చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో అధికారులు 2,405 రుణ యూనిట్లు మంజూరుచేశారు. ఫ్లవర్ బొకేలు, వర్మీకంపోస్ట్ యూనిట్, వెబ్ సైట్ డెవలప్‌మెంట్, ఎల్‌ఈడీ బల్బుల అసెంబ్లీ యూనిట్, ప్లంబింగ్, వాటర్ బాటిల్ రీసైక్లింగ్, వాటర్‌రీసైక్లింగ్ యూనిట్లు, ఫిష్ ఫార్మింగ్, అడ్వెంచర్ టూరిజం, సబ్బుల తయారీ, మొబైల్‌కార్ వాష్, బేకరీ, ఫ్లై యాష్ బ్రిక్ యూనిట్, సెరికల్చర్, వెల్డింగ్, బ్యూటీపార్లర్, మెడికల్ ల్యాబ్, మూడు చక్రాల ప్యాసింజర్ ఈ-ఆటో, నాలుగు చక్రాల ఆటో, కారు, గూడ్స్ ట్రక్ ఇలా నచ్చిన వ్యాపారం ఏదైనా చేసుకునేలా దరఖాస్తు నిబంధనలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల్లో ఉన్న యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. బీసీ కార్పొరేషన్ పరిధిలో కాకినాడ జిల్లాకు రూ.39.52కోట్ల విలువైన 1,914 యూనిట్లకు31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147 మంది పోటీపడ్డారు. కాపు కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాలో రూ.28.24కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది దరఖాస్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14కోట్ల విలువైన 511యూనిట్లు మంజూరవగా, ఆరు వేల దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లకు 5,497, కోనసీమ జిల్లాకు 1,043యూనిట్లకు 3,265, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు. అతికష్టంపై వీటిని పరిశీలించిన అధికారులు ఏప్రిల్‌లో బీసీ కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ రుణానికి ఆమోదం ఇచ్చారు. జాబితాలను బ్యాంకులకు పంపగా చాలావరకు రుణాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇక యూనిట్లు చేతికి అందడ మే తరువాయి అనుకున్న తరుణంలో మే 8న అమరావతి నుంచి ఉన్న తాధికారులు తక్షణం యూనిట్ల మంజూరును నిలిపివేయాలని నోటి మాట ఆదేశాలు జారీచేశారు. దీంతో కంగుతిన్న లబ్ధిదారులు ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో వీటిని త్వరలో రెట్టింపు చేయనున్నట్లు వివరించారు.

ఉలుకుపలుకూ లేదంతే...

మే8న నిలిపివేసిన స్వయం ఉపాధి యూనిట్లను ఇప్పటికీ అధికారులు ప్రారంభించలేదు. ఒకరకంగా చెప్పాలంటే అయిదునెలల నుంచీ కనీసం వీటిపై సమాధానం కూడా ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు. స్వయం ఉపాధి పథకానికి ఎంపికయ్యామని సంతోషిస్తే తీరా చేతికి అందినట్లే అంది చేజారిపోవడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి లేకలేక మంజూరైన యూనిట్లపై లబ్ధిదారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇవి చేతికి వస్తే ఉపాధి లభిస్తుందని సంతోషపడ్డారు. కానీ అదనపు యూనిట్ల మంజూరు పేరుతో మొత్తం నిలిపివేయడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఐదు నెలలు దాటిపోయినా అసలు ఇవి మంజూరు చేస్తారా? లేదా? అనేదానిపై జిల్లాల అధికారులకు కూడా సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులకు ఏం చెప్పలేకపోతున్నారు. అటు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు సైతం తాజాగా ఈ తలనొప్పి పట్టుకుంది. పథకానికి ఎంపికైన లబ్ధిదారులు, అదనపు యూనిట్ల కోసం చూస్తోన్న నిరుద్యోగులు సైతం ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి ఎప్పుడు మంజూరవుతాయో తెలుసు కోవాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో ప్రజాప్రతినిధులకు ఏం పాలుపోవడం లేదు. పైగా మంజూరైన యూనిట్లు పెంచాలని ఒత్తిడి తెచ్చింది తామే అయినా చివరకు ఉన్నవీ నెలల తరబడి ఆగిపోవడంతో సమాధానాలు చెప్పలేక గింజుకుంటున్నారు. వాస్తవానికి యూనిట్ల సంఖ్యను అధికారులు పెంచాలనుకుంటే తొలివిడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తిచేసి రెండోదశ ప్రక్రియ ఆ తదుపరి ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఏఇబ్బంది ఉండేది కాదు. తీరా పెంపు పేరుతో అసలుకే ఎసరు పడడంతో అంతా తలపట్టుకుంటున్నారు. మరో పక్క ప్రభుత్వం రావడంతో తమ బంధువులకు సైతం ఏదొక ఉపాధి యూనిట్ మంజూరు చేయించుకోవాలని భావించిన పార్టీ నేతలు, క్యాడర్‌కు నిరాశే ఎదురైంది. తాజాగా అయిదు రోజుల కిందట అమరావతిలో సంక్షేమశాఖలపై సమీక్ష జరిగింది. యూనిట్ల పెంపు, మంజూరుపై ఇందులో స్పష్టత వస్తుందని అంతా భావించినా ఈ ప్రస్తావన లేకపోవడంతో ఎప్పుడు మంజూరవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

పనితీరు మార్చుకోండి

» నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్యాలు అందివ్వాలి
» స్కిల్ డెవలప్‌మెంట్ పనితీరుపై ఎంపీ అసంతృప్తి
» కాకినాడ స్మార్ట్‌సిటీకి రూ.194కోట్లు నిధులు రావాలి
» అప్పుల్లో ఉన్న కాకినాడ కార్పొరేషన్‌కు సాఫ్ట్‌లోన్స్: కలెక్టర్



మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని కాకినాడ ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాసు అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు పర్యవేక్షణకు ఈ కమిటీ ఏర్పాటైందన్నారు. జిల్లాలో ఉన్న వివిధ పరిశ్రమల్లో పనిచేయడానికి ఏ స్కిల్స్ ఉన్న అభ్యర్థులు కావాలో..ఎంతమంది కావాలో వివరాలు సేకరించి 15రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు.వివిధ కేంద్ర పథకాలకు సంబంధించి ఏ స్కీంలు జిల్లాకు ఉపయోగపడతాయో వాటి ప్రతిపాదనలను 15రోజుల్లో తయారు చేసి అందించాలన్నారు. ఈ కమిటీ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వపథకాల అమలు క్షేత్రస్థాయిలో సమస్యలపై ప్రస్తాయించామన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో కావాల్సిన నైపుణ్యాలను జిల్లాలో నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలని, దానికి కావాల్సిన నిధులు సమకూర్చుతామని అన్నారు. జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనిపైన సీఎం, డిప్యూటీ సీఎం కూడా అసంతృప్తిగా ఉన్నారని, పనితీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం విశ్వకర్మ పథకంలో లక్షా2వేల దరఖాస్తులు వచ్చినా యూనిట్ల గ్రౌండింగ్‌లో ప్రగతి లేదని అన్నారు.

కమిటీ సభ్యులు, కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కమిటీ ఛైర్‌పర్సన్, సభ్యులు సూచించిన అంశాలపై అధికారులు దృష్టిపెట్టి పరిష్కరించాలన్నారు. కాకినాడ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపుతామన్నారు. 2015లో కాకినాడస్మార్ట్‌సిటీగా ఎంపికవ్వగా ఆ నిధులతో చేసిన పనుల్లో ఇప్పటికీ రూ.194కోట్లు నిధులు విడుదల కాలేదన్నారు. నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.80కోట్ల వరకు అప్పులు ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో సాఫ్ట్‌లోన్స్ కల్పించే దిశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు. కాకినాడ వార్ఫ్‌రోడ్డులోఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.పీఎంఈజీపీ, పీఎంఎంవై, ముద్రా, జాతీయ ఆరోగ్య పథకం, జనని సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృ వందన, సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నిర్మూలన, జాతీయ పట్టణ ఆరోగ్యపథకం, శిశు సంరక్షణ కేంద్రాలు, గ్రామీణ కౌశల్ యోజన, పింఛన్లు, అంగన్‌వాడీల ద్వారా అందించే సేవలు, మిషన్‌శక్తి, బేటీ బచావో బేటీ పడావో, రాష్ట్రీయ గోకుల్ మిషన్ వంటి వాటిపై సమీక్షించారు. కార్యక్రమంలో శాసనమండలిసభ్యులు కర్రి పద్మశ్రీ, పేరా బత్తుల రాజశేఖరం, ట్రైనీ కలెక్టర్ మనీషా, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఏవో బుజ్జిబాబు, దిశా కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్.. హాజరైన అధికారులు

ఇక వేటకు పయనం



» సోమవారం నుంచి వేటకు వెళ్లనున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులు
» మూడువారాలకుపైగా వేటకు వెళ్లని వైనం
» డిప్యూటీ సీఎం భరోసాతో ఆనందం

కొత్తపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తీరప్రాంత మత్స్యకారులు ఈనెల 12వతేదీ సోమవారం నుంచి సముద్రంలో వేటకు వెళ్లనున్నారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతాల గ్రామాలకు చెందిన మత్స్యకారులు తీరంలో నెలకొల్పిన రసాయన పరిశ్రమలవల్ల కాలుష్య వ్యర్థాలు సముద్రంలోకి విడిచిపెడుతున్నారని, దీంతో సముద్రం కలుషితమై మత్స్యసంపద అంతరించిపోవడంతో తమ జీవనోపాధికి ఆటంకం ఏర్పడుతోందని గతనెలలో 23వతేదీ నుంచి రెండురోజులపాటు ఉప్పాడ రింగ్‌సెంటర్‌లో ఆందోళన చేపట్టడం, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆందోళన చేపట్టిన మత్స్యకారులతో చర్చించడం,తమ సమస్యలపరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉప్పాడ వచ్చి చర్చిస్తే కానీ ఆందోళన విరమించేది లేదని మత్స్యకారులు భీష్మించడం, దానిపై డిప్యూటీ సీఎం అక్టోబరులో 10వతేదీలోగా ఉప్పాడ వస్తారని కలెక్టర్ హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఈనేపథ్యంలో పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ గురువారం నేరుగా ఉప్పాడ వచ్చి మత్స్యకారులతో మాట్లాడారు. తీరప్రాంతంలో రసాయన పరిశ్రమల ఏర్పాటు కారణంగా మత్స్య సంపద అంతరించి పోతుందనే విషయమై తాను స్వయంగా పరిశీలిస్తానని, పూర్తిస్థాయి సమస్యల పరిష్కారానికి తనకు 100రోజులు గడువు కావాలని డిప్యూటీ సీఎం మత్స్యకారులను సభావేదిక నుంచి కోరారు. దీంతో మత్స్యకారులందరూ ఆనందపరవశులయ్యారు. మూడువారాలుగా నిలిపివేసిన వేటను తిరిగి సోమవారం మొదలుపెట్టాలని మత్స్యకారులు నిర్ణయించుకున్నట్టు మత్స్యకార నాయకులు సూరాడరాజు, ఉమ్మిడి జాన్, నక్కా మణింకర, కంబాల రాంబాబు తెలియజేశారు.

నిబంధనలు అతిక్రమించిన బాణసంచా తయారీదారులపై చర్యలు

» అన్ని అనుమతులు ఉన్నా ప్రమాదం జరిగితే యజమానిపై కేసు
» బాణసంచా ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు
» దీపావళిని ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలి
» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ప్రభుత్వనిబంధనలను అతిక్రమించిన బాణా సంచా తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి శుక్రవారం ఆయన అగ్నిమాపకశాఖ అధికారులు, తహసీల్దార్లు, బాణసంచా తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీకేంద్రంలో భారీ ప్రమాదం సంభవించిన నేపథ్యంలో జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ దీపావళి నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని అనుమతులు ఉన్నా ప్రమాదం జరిగితే బాణా సంచా తయారీ యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో 29 బాణా సంచా తయారీ కేంద్రాలు, 11 స్టోరేజ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. తయారీ కేంద్రాలలో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా ప్రమాద బీమా నమోదు చేయించాలన్నారు. బాణసంచాలో ఉల్లిబాంబుల తయారీ నిషేధించామన్నారు. దీపావళిని ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ రాయవరం ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారన్నారు. బాణసంచా తయారీ కేంద్రాల వద్ద నూరుశాతం ఫైర్ సేఫ్టీ కచ్చితంగా పాటించాలన్నారు. బాణసంచా కేంద్రంలో పని చేసే కార్మికులకు అగ్నిప్రమాదాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20న దీపావళి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేశ్, సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి సుబ్బారావు, డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పీఎం ధనధాన్య యోజన పథకం ప్రారంభం

» వర్చువల్‌గా హాజరవుతున్న వ్యవసాయశాఖ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధనధాన్య కృషీ యోజన పథకం శనివారం ప్రారంభం అవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంనుంచి జేడీ విజయ్‌కుమార్‌తోపాటు ఇతరఅధికారులు వర్చువల్‌గా హాజరవుతున్నారు. దేశంలో వెనుకబడిన జిల్లాల్లో వ్యవ సాయానికి చేయూతనందించడానికి కేంద్రప్రభుత్వం కొత్తగా ఈపథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పంట ఉత్పాదకత పెంచడం, పంటలమార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం, పంచాయతీ, మండలస్థాయిలో పంటలను నిల్వ చేసుకునే గిడ్డంగులస్థాయిని పెంచడం, సాగునీటి సదుపాయాలు కల్పిస్తారు. ఈ పథకం అమలుకు ప్రతి జిల్లాకు కేంద్ర నోడల్ అధికారి నియమించనున్నారు.

ఇకనుంచి ల్యాండ్ పార్సిల్ భూములన్నీ ఈ-క్రాప్‌లోకి..

» వీసీలో వ్యవసాయశాఖ జేడీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం వ్యవసాయంలో పంటలు సాగుచేసిన భూములనే కాకుండా ల్యాండ్ పార్సిల్ భూములను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కాకినాడనుంచి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు, రైతుసేవాకేంద్రాల్లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగుచేయని భూములు, దేవదాయ, ధర్మదాయశాఖ భూములు, వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించని భూములను ఈ-క్రాప్ యాప్‌లోకి ఎక్కించాలన్నారు. యాప్‌లో పంటలు సాగు చేసిన వివరాలను వేరుగా, ఇతర ల్యాండ్ పార్సిల్ భూములను వేరుగా నమోదు చేయాలన్నారు. వ్యవసాయ భూమిలో ఇళ్లు నిర్మించి ఉంటే వాటిని ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. గ్రామకంఠం, పోరంబోకు, రెవెన్యూ భూములు, ఆక్వాచెరువులు, పంచాయతీ చెరువులను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. దేవదాయశాఖ భూములు, నాన్‌వెబ్‌ల్యాండ్ భూములను ఎక్కించడానికి యాప్‌లో ఆప్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు.

నాటుసారాను నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి

» నవోదయం 2.0 సమీక్షలో కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నాటుసారాను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో నవోదయం 2.0 నాటుసారా నిర్మూలనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించే వారు ఇకపై ఆ పనులు మానుకోవాలని సూచించారు. నవోదయం 2.0 ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సారా తయారీ, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నా రు. ఎక్కడైనా నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా, అమ్మకాలు జరి పినా 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయా లన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. సారాతయారీకి ఉపయోగించే ముడిపదార్థాలు విక్రయించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో గుర్తించిన 136 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ రేణుక మాట్లాడుతూ జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 136 నాటుసారా తయారీ గ్రామాలను గుర్తించామన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ కుటుంబాలను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటుసారా తయారు చేసేందుకు నల్లబెల్లం విక్రయిస్తే ఆయా వ్యాపారవేత్తల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాసు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధి, భద్రత ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టర్ నుంచి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్త్రీ-శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్యశాఖలు సంయుక్తంగా పాల్గొన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఆడపిల్ల అభివృద్ధి భద్రతపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. బాలికలు వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సచివాలయ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, మండల స్థాయిలో అక్టోబరు 11 నుంచి 18 వరకు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఎంపికైన 12మంది బాల-బాలికలకు కలెక్టర్ షాన్‌మోహన్ నగదు బహుమతులు, సర్టిఫికెట్లు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో పిల్లి రమేష్, సీడీపీవో జ్యోతి, సూపరింటెండెంట్ లావణ్య, హెల్త్ ఆఫీసర్ నరసింహనాయక్, పి.ఉమా, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.





ధ్వజ పటం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

కోనసీమ తిరుమల వాడపల్లి కాంతులీనింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చందనస్వరూపుడైన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఆలయ ముఖ, వసంత మండపాల్లో ఫల, పుష్ప అలంకరణలు సుగంధ పరిమళాలు వెదజల్లాయి. కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

- ఘనంగా ప్రారంభమైన వాడపల్లి వెంకన్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- ధ్వజారోహణతో అంకురార్పణ చేసిన అర్చకస్వాములు, వేదపండితులు
- తొలి రోజు రాత్రి శేష వాహనంపై భక్తులకు అభయమిచ్చిన శ్రీవారు

దేవదేవం భజే

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన శుక్రవారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు... స్వస్తివచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, అగ్ని ప్రతిష్ఠాపనలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, వాస్తు పూజ, హోమాలు జరిపారు. వసంత మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ధ్వజారోహణం గావించారు. ధ్వజపటాన్ని మేళతాళాలలో ఊరేగించి దేవతలను ఆహ్వానించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠించిన గురుడికి ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రాత్రి శ్రీవారు పరవాసుదేవ అలంకరణలో శేష వాహనంపై కొలువుదీరి తిరువీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.



పూజలు చేస్తున్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు





శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, హారతి తీసుకుంటున్న భక్తులు



భద్రతా ఏర్పాట్లపై ఈవోతో చర్చిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీ

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. మాడవీధులు, పార్కింగ్ ప్రదేశం, క్యూలైన్ల ఏర్పాట్లను చూసి భద్రతా ఏర్పాట్లపై ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. వేలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 800 మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.

బయట తిండి... కడుపు మండి





రవికుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే అవకాశం లేకపోవడంతో ఓ హోటల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తాడు. సాయంత్రం ఆఫీసు నుంచి వెళ్తూ వెళ్తూ... నూడిల్స్, ఫ్రైడ్‌రైస్, బజ్జీ మిక్చర్... ఇలా ఏదో ఒకటి బయట ఫుడ్ తిని ఇంటికి చేరతాడు. వారం క్రితం కడుపులో మంట రావడంతో వైద్యులను సంప్రదించాడు. బయట జంక్ ఫుడ్ తినడం వల్ల ఈ సమస్య వచ్చిందని డాక్టర్ చెప్పారు.



- మారుతున్న ఆహారపు అలవాట్లు
- ఉరుకులు, పరుగుల జీవనంలో స్ట్రీట్ ఫుడ్‌పైనే ఆధారం
- రోగాలపాలవుతున్న జనం
- పెరుగుతున్న గ్యాస్ట్రిక్ సమస్యలు



కిరణ్‌కుమార్‌కు పెళ్లయ్యింది. వీధి వీధి తిరిగి వ్యాపారం చేస్తాడు. ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వ్యాపారం నిమిత్తం వస్తాడు. రాత్రి ఏడెనిమిది గంటలకు తిరిగి ఇంటికి వెళ్తాడు. అయితే ఈ సమయంలో ఆయన ఆకలిదప్పికలు తీర్చుకునేది పూర్తిగా బయటే. మధ్యాహ్నం ఏదో ఒక హోటల్‌లో భోజనం.. సాయంత్రం స్నాక్స్ తర్వాత ఇంటికి వెళ్లడం.. ఇదే అతడి రోజువారీ తంతు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వారే కాదు.. ఇలాంటి వారెందరో బయట ఆహారంపైనే ఆధారపడుతున్నారు. లేనిపోని అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ఉరుకులు, పరుగుల జీవనంతో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో బయట ఆహారం తినేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంట్లో వంట చేసే సమయం లేని కొందరు.. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. వారంలో కనీసం రెండు, మూడు రోజులు ఇలా స్ట్రీట్ ఫుడ్‌లపై ఆధారపడుతున్నారు.

ఆహార పదార్థాల విక్రయాలు మొదలు, వంట నూనెల ఉత్పత్తుల నుంచి విక్రయదారుల వరకు ప్రతి ఒక్కరూ ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం కింద లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు పదివేల మందికిపైగా హోటళ్లు, ఫుడ్, బేకరీస్, ఆయిల్ ఉత్పత్తి తదితర వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. అయితే వీరిలో ఫుడ్ లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసే వారు చాలా తక్కువ. ఇటీవలి కాలంలో స్ట్రీట్ ఫుడ్ బిజినెస్ విపరీతంగా పెరగడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయి. ప్రజలు కూడా బయట ఆహారాన్ని తినేందుకు ఆసక్తి చూపుతుండడంతో వీరి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది.

హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బజ్జీల కొట్లు, గోబీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర వాటిల్లో కల్తీ నూనెను ఎక్కువగా వినియోగిస్తున్నారు. మల్టీస్టోర్స్ విజిటబుల్ ఆయిల్స్ (ఎంఎస్‌వీవో), అగ్‌మార్క్ నిబంధనలకు లోబడి నిర్దేశిత పరిమాణంలో నూనెలు కలపాలి. కానీ కొందరు తమ ఇష్టానుసారంగా నూనెలు కల్తీ చేస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన టేస్టింగ్ సాల్ట్, కాల్షియం కార్బైడ్ తదితర ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. అయితే ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారులు, నగరపాలక ఆరోగ్య శాఖాధికారులు చోద్యం చూడడం విశేషం.

తాజా పదార్థాలుగా చూపి...



మాంసం, చేపలు, రొయ్యలతో తయారుచేసే నాన్ వెజ్ ఆహారాన్ని రోజుల తరబడి డీప్ ఫ్రిజ్‌లో ఉంచుతున్నారు. వినియోగదారులు కోరినప్పుడు వాటికి మసాలాలు దట్టించి వేడివేడిగా వడ్డిస్తున్నారు. సాస్‌లు, బిర్యానీ, తందూరీ చికెన్లలోనూ కృత్రిమ రంగులు కలుపుతున్నారు. మిఠాయిలు, కేక్‌లు, మసాలాలు, మాంసాహారానికి ఎరుపు రంగు, బంగాళాదుంప చిప్స్, పాప్‌కార్న్ వంటి వాటికి పసుపు రంగు, ఐస్‌క్రీమ్, సూప్‌లు, బఠానీ తదితర వాటికి నీలం, ఆకుపచ్చ రంగులు వాడుతున్నారు. కృత్రిమ రంగులు అద్దడం వల్ల అవి నాణ్యంగా, తాజాగా ఉన్నట్టు కనిపిస్తాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న వాటిని తాజా పదార్థాలుగా భ్రమించి ఆరగిస్తున్న వినియోగదారులు రోగాల బారిన పడుతున్నారు.

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నెలకు సుమారు వెయ్యి మంది వరకు ఓపీ వస్తారు. వారిలో 40 శాతం బయట ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధ వ్యాధుల బారిన పడిన వారే. వీధిలో తిండి తింటే కడుపులో మంట ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...

పదేపదే కాచిన నూనెతో చేసిన వంటకాలు తింటే తొలుత గ్యాస్ట్రిక్, అల్సర్ తర్వాత క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కల్తీ చేసిన వాటితో గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చెప్తున్నారు. కృత్రిమ రంగులు కలిపిన వాటిని ఎక్కువకాలం తినడం వల్ల మనుషులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో హైపర్ యాక్టివ్, అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లతో పాటు జీర్ణకోశ వ్యాధులు, ఉబ్బసం వంటివి తలెత్తుతాయి. సింథటిక్ రంగులు మహిళల విషయంలో రుతు సంబంధ ఇబ్బందులు, మైగ్రేన్ తలనొప్పి, థైరాయిడ్, గర్భకోశ, కిడ్నీ, కాలేయ వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దాలి

- ఆర్‌జేడీ నాగమణి
- డీఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



రాజానగరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి (ఇన్‌సెట్లో) ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు/కాకినాడ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శారీరక, మానసిక నైతిక వికాసం, విజ్ఞానం అందించి సమగ్ర మూర్తిమత్వం గల పౌరులుగా తీర్చిదిద్దాలని జోన్-2 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉద్బోధించారు. నూతన ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహించిన ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రాజానగరం మండలంలో ఆరు కేంద్రాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించగా జీఎస్ఎల్ దంత కళాశాలలో జరిగిన ముగింపు వేడుకలకు ఆర్‌జేడీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలు కలిగిన అద్భుతమైన సమాజం నిర్మించేది ఉపాధ్యాయులేనన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జీఎస్ఎల్ వైద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో జరిగిన ముగింపు సభలో డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నుంచి అభ్యసనా ఫలితాలను సాధించేందుకు వినూత్నమైన వ్యూహాలతో బోధించాలని సూచించారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎనిమిది రోజులపాటు బోధనా పద్ధతులు, బోధనా వ్యూహాలు, పాఠ్యప్రణాళికలు నిరంతర సమగ్ర మూల్యాంకనపుస్తకం, ఉపాధ్యాయ కరదీపిక, హోలిస్టిక్ ప్రగతిపత్రం పాఠ్యప్రణాళికలు తదితర నూతన అంశాలపై శిక్షణ ఇచ్చారు. తెలుగు, హిందీ, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఫిజికల్ డైరెక్టర్‌లకు అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ముగింపుసభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్జీటీలకు ఆర్ఐఎఫ్‌టీ ఇంజనీరింగ్ కళాశాలలో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల్లో నియామక ఉత్తర్వులను ఇచ్చామన్నారు. స్కూల్ అసిస్టెంట్, పీజీటీ కేడర్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కేటాయించబడతాయని తెలిపారు. ఉపాధ్యాయుల మెరిట్ ర్యాంకు ఆధారంగా వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లమేరకు పోస్టింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతాయన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు నియామక ఉత్తర్వులను లీప్ యాప్‌లో వ్యక్తిగత లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 13న వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని సూచించారు. ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు తదుపరి విడతలో నిర్వహించే శిక్షణకు హాజరై పూర్తిచేసిన తరువాత మాత్రమే వారు పోస్టింగ్ ఆర్డర్లు పొందాల్సి ఉంటుందని డీఈవో రమేష్ పేర్కొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు కేంద్రాల్లో మెగా డీఎస్సీ 2025 నూతన ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. అయితే ఏడింటిలో ఆరు కేంద్రాలు రాజానగరం మండలంలోనే ఎంపిక చేసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆరింటికి 1424 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించగా 1415 మంది శిక్షణకు హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

కాకినాడలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా



కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘం సిఫార్సులను పెన్షనర్లందరికీ వర్తింపజేయాలన్న డిమాండ్లతో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కు మద్దతుగా శుక్రవారం కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ధర్నా చేశారు. ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా చైర్మన్ పి.మహేశ్వరరావు, కన్వీనర్ తురగా సూర్యారావు, ఫైనాన్స్ కార్యదర్శి డీఎల్ఎన్ శాస్త్రి ఆధ్వర్యం వహించారు. ప్రధాన తపాలా కార్యాలయం నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. ఆల్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు జీవీ లక్ష్మీనారాయణ, డి.మాణిక్యాలరావు, సీహెచ్ రామారావు, ఎం.కూర్మారావు,ఎన్. త్రినాథరావు, ఎన్.భాస్కరరావు, డేగల వీరభద్ర రావు, యూఎస్ఎన్ రెడ్డి,సురేష్‌రెడ్డి, ఎం.శ్రీరామ్మూర్తి, హుస్సేన్, సుభాన్ పాల్గొన్నారు.

13న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు.వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

రేపు ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

శెట్టిబలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి



సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎంపిక శెట్టిబలిజ విద్యార్థులు 300 మందికి స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు.576 నుంచి 600 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, 551 నుంచి 575 మార్కులు సాధించిన వారికి రూ.5 వేలు, 500 నుం చి 550 మార్కులు సాధించిన వారికి రూ.3,500 స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, బీసీ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారిలను సత్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు విచ్చేయనున్నట్టు చెప్పారు. స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎస్ఆర్ ఫండ్స్ రూ.10 లక్షలు ఇప్పించారని కుడుపూడి పేర్కొన్నారు. కాగా స్కాలర్‌షిప్స్ పంపిణీకి మొత్తం 300 మంది విద్యార్థులకు గాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 120 మంది, మిగిలిన కాకినాడ, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి 180 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు సమాచారం. సమావేశంలో శ్యామలాంబ దేవస్థానం చైర్మన్ కడియాల వీరభద్రరావు, బుడ్డిగ రాధా, కడలి రామకృష్ణ, శీలం గోవింద్, ముసిని బాబురావు, చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో ఆహార మహోత్సవం



ఆహార మహోత్సవం బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న ఆహార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. అరటి ఆకులపై వినూత్న రీతిలో సిద్ధం చేసిన ఆహార మహోత్సవం బ్రోచరును ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా 14,15,16 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు, పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం ఫుడ్ అండ్ టెక్నాలజీ విభాగాన్ని 86395 50186లో గాని, విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు..

యువతకు ఫర్నిచర్ ఫిట్టింగ్‌లో శిక్షణ !

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా యువతను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రతినిధులు కలెక్టర్ చాంబర్‌లో కలిసారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిరుద్యోగ యువతకు ఫర్నీచర్ ఫిట్టింగ్ శిక్షణ ప్రారంభించేందుకు కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత స్కిల్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ట్రైనర్ విలాసిని, విశ్వనాథ్ పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన

హాకథాన్-2025



జేఎన్టీయూకే, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో రెండు రోజులు నిర్వహించిన హాకథాన్-2025 శుక్రవారం ముగిసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. జేఎన్టీయూకే డైరెక్టరేట్ ఆఫ్ ఇంక్యుబేషన్ సెంటర్(డీఐసీ) సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 80మంది విద్యార్థులు పాల్గొని విభిన్న రంగాల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రతిపాదించారు. జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు దేశ జీడీపీ పెరుగుదలకు, భారత ఉత్పత్తిరంగ అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. డీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.గోపాలకృష్ణ విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలకు మద్దతునివ్వడంలో డీఐసీ పాత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

సత్యదేవుడి సన్నిధిలో పలు వసతులకు పాలకమండలి చైర్మన్ ఆమోదముద్ర



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి చైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదముద్ర వేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రధానంగా రూ.4.72 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ నందు విద్యుత్ సరఫరాకు సంబంధించి మెటీరియల్ కొనుగోలుకు, రూ.6.14 లక్షలతో సత్యదేవుడి తెప్పోత్సవంలో తాత్కాలిక విద్యుత్ అలంకరణలకు, రూ.5.10 లక్షలతో మెయిన్‌క్యాంటీన్‌ను డార్మెటరీగా మార్చి భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. రూ.6 లక్షలతో ఆగ మ పాఠశాల వద్ద విద్యార్థుల వసతికి సంబంధించి మెరుగైన సౌకర్యాల కల్పన, రూ.1.40 లక్షలతో కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి తెప్పోత్సవ నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల నిర్వహించిన వివిధ షాపుల బహిరంగ వేలం లో అధిక మొత్తానికి వచ్చిన టెండర్లను, దేవస్థానంలో వివిధ పనులకు సంబంధించి పనులలో లోయస్ట్‌టెండర్‌కు ఆమోదం లభించింది. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరిపై ప్రొటోకాల్ వాట్సాప్ మెసేజ్‌లు కుదరవు

ఐదు రోజులు ముందుగా ఇచ్చే సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్రంగదులు, దర్శనాలు, వ్రతముల నిర్వహణ కోసం ప్రముఖులు అందించే వాట్సాప్ మెసేజ్‌లకు ఇకపై కేటాయింపు నిలుపుదల చేయనున్నట్టు ఈవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫారస్ లేఖలను 5రోజుల ముందుగా అందజేస్తేనే కేటాయింపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి సహకరించాలని కోరింది.

సత్యదేవుడికి బస్సు విరాళం

ప్రత్యేక పూజల అనంతరం అందించిన ఎస్‌బీఐ చైర్మన్

అన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు రవాణా సౌకర్యం కోసం 32 సీట్లు సామర్థ్యం కలిగిన సుమారు రూ.25 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేశారు. ఈ బస్సు తాళాలను ఎస్‌బీఐ చైర్మన్ దేవస్థానం ఈవో, చైర్మన్‌కు అందజేశారు. ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్, హేమంత్‌కుమార్, పంకజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు బస్సు అందజేస్తున్న ఎస్‌బీఐ చైర్మన్



మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు గుర్తించాలి

కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు వరప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసుకు వచ్చిన పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గుర్తించాలని కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీజీహెచ్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మానసిక ఆరోగ్య పరిస్థితిపై ఒక ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా నిలదొక్కుకోగలం అనేదానిపై ముందు నుంచీ అవగాహన లేకపోతే ఆత్మహత్యలకు దారితీయవచ్చన్నారు. మానసిక అనారోగ్య లక్షణాలను గమనించిన వెంటనే మానసిక వైద్య నిపుణుడిని కలిసి అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్య సమస్యల మాదిరిగానే ఒక్కో సారి మానసిక సమస్యలు అత్యవసరంగా రావచ్చన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం బాణసంచా ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

ఏలూరు రేంజ్ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు : డీఐజీ



రాయవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

రాయవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో అన్ని జిల్లాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ స్టాక్ పాయింట్లు తాత్కాలిక లైసెన్స్ పొందిన షాపులపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి తనిఖీ చేసిన సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈనెల 8న రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన బాణసంచా విస్ఫోటనం ప్రమాదంపై దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ టీం క్లూస్ వివరాలు సేకరించిందని, ప్రమాదంపై రిపోర్టు రావాల్సి ఉందన్నారు. తాను ఇప్పటికే అమలాపురం, మండపేట తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశానన్నారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నప్పటికీ అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించేందుకు ఆపరేటర్ చేసే వ్యక్తి లేనట్టు గుర్తించినట్టు చెప్పారు. ప్రతి బాణసంచా తయారీ కేంద్రం వద్ద ఫైర్‌సేఫ్టీ మోకానిజం ఉపయోగించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించేలా ఆయా దుకాణదారులను అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీకి సూచించారు. బాణసంచా కొనుగోలు చేసి వచ్చే సంవత్సరం ఉపయోగించుకోవచ్చనే ఆలోచనతతో కొంతమంది ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచినా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు ఇంట్లో గాని, అనుమతులు లేకుండా గాని బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు. ఆయన వెంట ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ పుల్లారావు, ఎస్ఐ డి.సురేష్ బాబు ఉన్నారు.

జీజీహెచ్ గైనిక్ విభాగంలో యువకుడు హల్‌చల్

ముగ్గురిని గాయపర్చిన వైనం

భయపడిన బాలింతలు

మానసిక రోగి అని తెలిసి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



యువకుడు దుర్గాప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో గురువారం రాత్రి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. గతంలో ఎంతోమంది చంటి బిడ్డలను ఎత్తుకుపోయిన ఉదంతాలు జరిగిన నేపథ్యంలో పిల్లలను ఎత్తుకు పోయేందుకు వచ్చాడని అతడి పట్టుకునేందుకు గర్భిణులు, బాలింతల సహాయకులు ప్రయత్నించగా సుమారు ముగ్గురిని పళ్లతో కరిచి గాయపర్చి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. యానాం శివారు కోలంకకు చెందిన 20 ఏళ్ల ఆకుల దుర్గాప్రసాద్ గురువారం రాత్రి గైనిక్ విభాగంలోని బాలింతల వార్డు వద్ద చంటి పిల్లలు ఉన్న చోట అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడ ఉన్న బాలింతలు వారి సహాయకులకు చెప్పడంతో వారు దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. అతడు కంగారుపడి ముగ్గురిని చేతుల జబ్బలపై కరిచి గాయపరిచాడు. ఇంతలో సెక్యూరిటీ సిబ్బంది అక్కడకి చేరుకుని బిత్తర చూపులు చూస్తున్న ఆ యువకుడిని పట్టుకుని జీజీహెచ్ అవుట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. వారు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. వారి ఇచ్చిన సమాచారం మేరకు దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని తమ కుమారుడు మానసిక రోగి అని, కాకినాడలో ఓ ప్రైవేటు సైకియాట్రీ ఆసుపత్రిలో చికిత్స ఇప్పిస్తున్నట్టు ఆధారాలతో పోలీసులకు చూపించడంతో ఆ యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఒంటరి మహిళను బెదిరించి చోరీ.. పదిమంది అరెస్టు

రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని వారణాసి వారి వీధిలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళను చంపుతామని బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో పదిమంది నిందితులను శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 26న ఒంటరిగా నివాసం ఉంటున్న వాకలపూడి కనకదుర్గను అర్ధరాత్రి సమయంలో ముఖానికి మాస్కులు ధరించి వచ్చి ఇంటిలోకి వచ్చి దుండగులు ఆమె చేతులను వెనక్కికట్టి, అరిస్తే చంపుతా మని బెదిరించి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న ఆభరణాలు సుమారు 70 కాసులతో పాటు రూ.70 వేల నగదును తస్కరించారు. కేసును సీఐ కొండయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. పదిమంది మరికొంత మందితో కలిసి ప్రణాళిక ప్రకారం దోపిడీకి పాల్పడి బంగారం, నగదు దొంగిలించి అందరూ పంచుకున్నట్టు గుర్తించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహమ్మద్ ఇక్బాల్ షేక్, రాజమహేంద్రవరానికి చెందిన మీసాల శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీకాంత్, దుర్గాపు సత్యనారాయణ, దివ్వెల యేసు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, శ్రీకాకుళం చిన్న, కర్రి సాయి, చంద్రారెడ్డిను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి పది బంగారు గాజులు, చెవి దిద్దులు జత, మాటీలు జత కలిసి 162.25 గ్రాముల బంగారు వస్తువులైన రూ.16లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐలు కె.కొండయ్య, బి.కృష్ణకుమార్, బి.బి.రవికుమార్, ఎస్ఐలు కె.శ్రీనివాసు, కె.ప్రసాదు, డి.ఆదినారాయణ ఉన్నారు.

32మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టివేత

ఆలమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 32 మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ శుక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో వచ్చిన వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో 2017 అక్టోబరులో ఒక వర్గం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 38మందిపై అప్పటి ఎస్ఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేశారు. అలాగే మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు చేశారు. అయితే ఒక కేసులో 6నెలల క్రితమే కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. అయితే 38 మందిలో ఆరుగురు మృతిచెందారు. మిగిలిన 32మందిపై ఉన్న అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టి వేస్తూ శుక్రవారం రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సాయిసునంద తీర్పు చెప్పారు. ఈ కేసులో న్యాయవాదులుగా ఎస్ఎస్.ప్రకాశరావు, నామన సీతారాములు ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో గుండెపోటుతో వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగిలో అమిరిశెట్టి దుర్గాప్రసాద్ (42) శుక్రవారం ఉదయం బాత్రూమ్‌కు వెళ్లిన అనంతరం అక్కడిక్కడే గుండెపోటుతో మరణించాడు. అతడు ప్రైవేటు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటన జరిగింది.ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మండలంలోని చివటం రైల్వే గేటు సమీపంలో సెప్టెంబరు 25న తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన గంటా గౌతమ్‌కుమార్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గౌతమ్ కుమార్‌ను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతమ్ కుమార్ అప్పుల బాధ భరించలేక పురుగు మందు తాగినట్టు ఎస్ఐ తెలిపారు. అతడికి భార్య, తొమ్మిది నెలల పాప ఉన్నారు. ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షణలో ట్రైనీ ఎస్ఐ కె.నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

గోకవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. స్థానిక ఠాణా సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులపై అనుమానంతో తనిఖీ చేశామని, వారి వద్ద 11 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్కూటీని సీజ్ చేశామన్నారు. నిందితులు రాజమహేంద్రవరానికి చెందిన చింతల మురారి, సూరి హేమంత్, దూలపల్లి నానిగా గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించనున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వెండి ఆభరణాలు చోరీ



పేరవరంలో చోరీ జరిగిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆత్రేయపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి స్వామివారికి అలంకరించిన వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఆలయ తలుపులను పగలు గొట్టి కిరీటం, అభయహస్తలు, శంఖుచక్రాలు, శఠగోపం చోరీ చేసినట్టు ఆలయ ధర్మకర్త వెంపాటి కృష్ణమూర్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

యువకుడి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామ్‌కుమార్

సీతానగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన మురాల అనిల్ దేవ (22) మృతి కేసులో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కప్పల సతీష్, రాజమహేంద్రవరానికి చెందిన కాలుకురాన వరుణ్ (చిన్ని)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు... గత నెల 29న అనిల్ దేవ మునికూడలిలోని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతుడి తల్లి కువైట్ నుంచి వచ్చిన అనం తరం ఈనెల 3న కుటుంబ సభ్యులు సమక్షంలో శవ పరీక్ష నిర్వహించారు. కేసు విచారణ అనంతరం సెక్షన్‌లను మార్పు చేశారు. సతీష్, వరుణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, నిందితులను జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసు విచారణ కొనసాగుతోందని, ఇంకా ఎవరైనా వ్యక్తులు ఉన్నట్టు నిర్ధారణ అయితే వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

తాటాకిల్లు దగ్ధం

నల్లజర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఊర మహంకాళికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం మహంకాళి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. వెంటనే బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్తులు మంటను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 విలువ చేసే సామగ్రి కాలిపోయినట్టు అధికారులు అంచనా వేశారు.

కారును ఢీకొన్న లారీ

నలుగురికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కత్తిపూడి నుంచి ఎర్రవరం వైపు వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బాబ్జీ, సుబ్బారావు, నాగరాజు, ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ గీత వైద్యం అందించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ భూమి అప్పగించాల్సిందే

- కాకినాడ నడిబొడ్డున 17ఎకరాలు ప్రైవేటు పరం
- రూ.510కోట్ల విలువైన భూమి బ్రైట్ టౌన్ కంపెనీకే..
- తక్షణం స్థలాన్ని పిటిషనర్‌కు అప్పగించాలని న్యాయస్థానం ఆదేశాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగర నడిబొడ్డున ఉన్న 17ఎకరాల భూమి ప్రైవేటుపరం అయిపోయింది. రూ.510కోట్ల విలువైన ఈ భూమిని పిటిషనర్‌కే అప్పగించాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి తాజాగా తీర్పు నిచ్చారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఈ 17 ఎకరాల భూమి తమదంటే తమదని ఒకపక్క ప్రభుత్వం, మరోపక్క ముంబైకి చెందిన బ్రైట్ టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1980నుంచీ న్యాయస్థానంలో పోరాడుతున్నాయి. దీనిపై సుదీర్ఘంగా పలు న్యాయస్థానాల్లో కేసు విచారణ కొనసాగుతూ వచ్చింది. అప్పట్లో కాకినాడ అర్బన్ మండలంలోని రమణయ్యపేట గ్రామం పరిధిలో 134/3 సర్వే నెంబర్‌లో ఉన్న ఈ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు తమవేనని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ ఆ భూమిని పిఠాపురం మహారాజా నుంచి తాను కొనుగోలు చేసినట్లు పిటిషనర్ వాదిస్తూ వస్తున్నారు. దీనికి సంబంధించి న్యాయస్థానాల్లో ఆధారాలతో కూడిన దస్తావేజులను చూపించారు. ఈ భూమి తమదేనని వాదిస్తోన్న అధికారులు సరైన భూరికార్డులు చూపించడంలో విఫలమవుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఎట్టకేలకు ఇన్నేళ్ల తర్వాత తాజాగా తీర్పు వెలువరించారు. రికార్డులు, ఇతర ఆధారాలన్నీ పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం మొత్తం భూమిని బ్రైట్‌టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించాలని ఆదేశించింది. కాగా నగరం నడిబొడ్డున ఉన్న పదిహేడెకరాల స్థలం ఇక్కడ ఎకరా రూ.30కోట్ల వరకు పలుకుతోంది. ఇంతటి విలువైన భూమి విషయంలో సరైన రికార్డులు న్యాయస్థానానికి అధికారులు అందజేయడంలో విఫలమవడంతో ప్రైవేటుపరం అయినట్లయింది. కాగా ఈ భూమిలో కొంత ప్రదేశంలో ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వ బాలుర వసతిగృహమైన ఆనంద నిలయం ఉంది.

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం రూ.19.96 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం ఆలయ ఆవరణలో దేవదాయ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తసంఘం సభ్యులతో నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండల చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు. 21 మార్చి నుంచి 9 అక్టోబరు 2025 వరకూ 199 రోజులకు గాను భక్తులు హుండీలలో వేసిన కానుకల ద్వారా 19,96,390 లభించినట్టు ఈవో నీలకంఠం పేర్కొన్నారు.

కాలినడకన కాశీ యాత్రకు పయనం...



కాలినడకన కాశీ బయలుదేరిన ఓలేటి దుర్గారావును అభినందిస్తున్న ప్రజలు

ఐ.పోలవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.మూలపొలానికి చెందిన ఓలేటి దుర్గారావు కాలినడకన కాశీ యాత్రకు బయలు దేరాడు. శుక్రవారం గ్రామంలో ఆర్ఎస్ఎస్ సేవకుడు రెల్లు గంగాధరం ఆధ్వర్యంలో గ్రామస్తులు దుర్గారావును ఆశీర్వదించి కాశీ యాత్రకు పంపించారు. 40రోజుల్లో ఆయన కాశీ చేరుకోనున్నట్టు చెబుతున్నారు. దుర్గారావును పరిసర గ్రామాల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మకు శుక్రవారం స్వర్ణ, రజత పుష్పార్చన వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణలో మండపంలో ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

'కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి'

కాకినాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో విద్యార్థులు తమ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగితే ఉన్నత భవిష్యత్తు కలుగుతుందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు అధ్యక్షతన కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సును ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ గత ఏడాది ఏపీఈఏపీ సెట్‌కు శిక్షణనిచ్చేందుకు ఫైడా ఫౌండేషన్ వారు సహకారమందించారన్నారు. 28 మంది విద్యార్థులు శిక్షణ పొందగా 24మంది 10వేలలోపు ర్యాంకులు సాధించి ఇంజనీరింగ్‌లో సీట్లు పొందారన్నారు. స్పోకెన్ ఇంగ్లిషులో కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల ఉపాధి కల్పన అధికారులు శ్రీనివాసరావు, శిరీష, వసంతలక్ష్మి, అధ్యాపకులు షజిత, కృష్ణ, ప్రేమ్‌కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.



బాలుడు కృష్ణన్ వైద్యం నిమిత్తం రూ.50వేలు అందజేస్తున్న శ్రీయువసేన సంస్థ ప్రతినిధులు

మూడు కుటుంబాలకు రూ.1.20 లక్షల సాయం

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరం, గ్రామీణ పరిధిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మూడు కుటుంబాలకు వైద్యం నిమిత్తం శుక్రవారం దాతల సహకారంతో శ్రీయువసేన సేవా సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్ రూ.1.20 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. కాకినాడ గ్రామీణ ప్రాంతానికి చెందిన సాయిరాం దంపతుల మూడున్నర సంవత్సరాల కుమారుడు కృష్ణన్ బ్రెయిన్, లివర్ వ్యాధితో బాధపడుతుండగా మెరుగైన వైద్యం నిమిత్తం రూ.50వేలు, నగరంలోని బుడంపేట ప్రాంతానికి చెందిన ఎం.రాజేష్ రెండు కాళ్లు పనిచేయక ఇంటికే పరిమితం కావడంతో వైద్యం కోసం రూ.40వేలు, నగరంలోని డెయిరీఫారం ప్రాంతానికి చెందిన మణికంఠకు రోడ్డు ప్రమాదంలో కాలికి, వెన్నుముకకు గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం రూ.30వేలు వారు అందించారు. శ్రీయువసేన సంస్థ పిలుపు మేరకు డాక్టర్ ప్రవీణ్‌చక్రవర్తి రూ.75వేలు, అడ్డూరి అరుణ్‌కుమార్ రూ.20వేలు, శ్రీయువసేన ఫండ్ బాక్స్ నుంచి రూ.15వేలు, మరికొందరు దాతలు రూ.10వేలు చొప్పున సాయం చేశారు.

జీఎస్టీ తగ్గింపు మంచి అవకాశం: ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పక్కగా అమలు చేస్తోందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా సేల్స్ ట్యాక్స్ కమర్షియల్ ట్యాక్స్ జీఎస్టీ అమలు విభాగం ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో 'ఎలక్ట్రానిక్స్ ఉత్సవ్' పేరిట విక్రయ మహోత్సవం ఏర్పాటుచేశారు. దీనిని ఎమ్మెల్యే కొండబాబు ది చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గ్రంధి బాబ్జీతో కలిసి ప్రారంభించారు. సేల్స్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మెషిన్లు, ఎయిర్‌కండిషనర్లు, గృహోపకరణాలు, అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు తగ్గిన జీఎస్టీ ధరలతో పాటు డిస్కౌంట్‌లతో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సేల్స్‌ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ టి.లలిత, అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.



జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీవోఏలు

కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం: వీవోఏలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకంగా మార్చిన జగన్ ప్రభుత్వం విధించిన మూడేళ్ల కాలపరిమితి నిబంధన ఉత్తర్వులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రద్దు చేయడంపై వీవోఏలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రమణయ్యపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద టీఎన్టీయూసీ అనుబంధ సంఘం జిల్లా వీవోఏలు (యానిమేటర్లు) ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నబ్బతి ఫణీశ్వరరావు, వీవోఏల సంఘ నాయకులు సవరపు పద్మావతి, మల్లవరపు రమణమ్మ, మట్టపర్తి సత్యవేణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు.

హక్కులకు భంగం వాటిల్లితే చట్టపరంగా చర్యలు

సీనియర్ సివిల్ జడ్జి బాబు

పిఠాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల హక్కులు భంగం వాటిల్లేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, మానసిక వికలాంగులకు అన్ని విధాలా శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, న్యాయవాదులు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తులు సమర్పించాలి : ఆర్డీవో

కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దీపావళి పండుగ నేపథ్యంలో తాత్కాలిక లైసెన్స్ దుకాణదారులు తమ వద్ద పనిచేసే కార్మికుల వివరాలను నిర్ణీత గడువులోగా కచ్చితంగా తెలియజేయాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు స్పష్టం చేశారు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, కార్మిక శాఖల అధికారులు మండల స్థాయిలో సంబంధిత విక్రయ ప్రదేశాలను తనిఖీ చేసి లైసెన్స్ మంజూరు ప్రతిపాదనలు పంపించాలన్నారు. దీపావళి దుకాణాల్లో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా బీమా కల్పించాలని, జీఎస్టీ ట్యాక్స్ చెల్లించాలన్నారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రంలోగా తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు ఉంచినా, లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపినా సంబంధిత తహసీల్దారు, పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలన్నారు. ఆర్డీవో కార్యాలయం 80088 03208 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఆడపిల్లలే అవనికి వెలుగు

ఐసీడీఎస్ సీడీపీవో ఉష



అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉష

సామర్లకోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలే అవనికి వెలుగు అని ఐసీడీఎస్ పెద్దాపురం సీడీపీవో జి.ఉష పేర్కొన్నారు. పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఐసీడీఎస్, ఐసీపీఎస్, మండల విద్యాశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో ఉష మాట్లాడుతూ ఈ నెలలో పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరున ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పథకాల ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అబ్బాయిపై పోక్సో చట్టప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ బాలబాలికలు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, నళిని, సుల్తానాబీబీ, నిర్మలాకుమారి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష, ఎన్జీవో బి.లక్ష్మి, పోలీసు అచ్చిబాబు, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పద్మనాభ కాలనీలోని డెన్నిస్ బచ్చు ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ మౌనిక, సీడీపీవో ఉష, ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.





డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన వేట్లపాలెం ఉన్నత పాఠశాల, సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

సామర్లకోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో రెండు రోజులు జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిసాయి. పలు అంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెలాఖరున కాకినాడ రెవెన్యూ డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు విలేకరులకు తెలిపారు. అండర్-14 బాలురు కేటగిరీలో వాలీబాల్ (ప్రథమ), కబడ్డీ (ద్వితీయ), సీనియర్ వాలీబాల్ (ప్రథమ), ఖోఖో (ప్రథమ) స్థానం సాధించారు. అండర్-14 బాలికల కేటగిరీలో వాలీబాల్ (ప్రథమ), అండర్-17 కబడ్డీ (ప్రథమ), అండర్-17 వాలీబాల్ (ప్రథమ) స్థానాల్లో నిలిచారు. మండలంలో అత్యధిక బహుమతులు సాధించిన వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయులు యార్లగడ్డ బంగార్రాజు, ఎండీ ఇబ్రహీంలను గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురు అండర్-17 ఖోఖోలో డి.రంజిత్, అంజిరెడ్డి, రాకేష్, గౌతం, కామేష్, చైతన్య, బాలికల విభాగంలో పి.తులసి, జి.వర్షిణి, ఎస్.రుక్మిణి, పి.జ్యోత్స్న, ఎస్.సత్యవాణి, కబడ్డీలో కె.అభిరామ్, సీహెచ్ కార్తీక్‌రెడ్డి, కె.ప్రవీణకుమార్, రన్నింగ్‌లో గౌతం డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని హెచ్‌ఎం సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో అభినందించారు.

'సమస్యలను పరిష్కరించాలి'

పిఠాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమస్యల పరిష్కార పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే రహదారులన్నీ జలమయం కావడంతో పాటు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోందని తెలిపారు. 2, 3, 4 వార్డుల్లో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేదన్నారు. కాలువల్లో పూడిక తొలగించట్లేదన్నారు. పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అనాథ పిల్లలకు డిప్యూటీ సీఎం పవన్ జీతం



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అనాథ పిల్లవాడికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేక అనాథలుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలోని పిల్లలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనకు జీతంగా వచ్చే సొమ్ముతో అండగా నిలిచారు. వరుసగా ఆరవ నెల 46 మంది అనాథలైన పిల్లలకు రూ.5వేలు వంతున రూ.2.30లక్షలను చెక్కుల రూపంలో పవన్ పంపారు. శుక్రవారం వాటిని జనసేన క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు, పట్టణాల్లోని పిల్లల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని ప్రతినెలా సొమ్ము పంపుతున్నారంటూ పవన్‌కు పిల్లల సంరక్షకులు కృతజ్ఞతలు తెలిపారు.

'దీపావళి బాణసంచా షాపుల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి'

పిఠాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా షాపుల ఏర్పాటులో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ హెచ్చరించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల పరిధిలోని దీపావళి షాపుల నిర్వాహకులు (తాత్కాలిక లైసెన్సుదారులు)తో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల నిర్వహణకు వీలుగా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. పెంకు చిచ్చుబుడ్డు అమ్మకాలను నిషేధించినట్టు తెలిపారు. అమ్మకందారులు అందరూ జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దుకాణాల వద్ద నీటతొట్టెలతో పాటు ఇసుక తదితరాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఎంపీడీవోలు కర్రి స్వప్న, సెలట్ రాజు, రూరల్ ఎస్ఐ జానీబాషా, ఫైర్ ఆఫీసర్ రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారులోని బాణసంచా తయారీ కేంద్రాన్ని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తనిఖీ చేశారు. ఏయే రకాల దీపావళి సామాన్లు తయారు చేస్తున్నారు, నిబంధనలు పాటిస్తున్నారా తదితర అంశాలను పరిశీలించారు. రాయవరం వద్ద ప్రమాదం జరిగిన నేపథ్యంలో తయారీ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అన్ని అంశాలను నిశితంగా పరిశీలించిన అనంతరం తిరిగి తెరవడానికి అనుమతి ఇస్తామని సీఐ శ్రీనివాస్ చెప్పారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో దీపావళి సామగ్రి ఏర్పాటు విషయంలో నిబంధనలు అతిక్రమించినా, అనధికారికంగా బాణసంచా నిల్వ చేసినా, తయారుచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా బాణసంచా తయారు చేయరాదని, నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగనాపల్లి, కొవ్వూరుల్లో మందుగుండు సామగ్రి తయారు చేసే యూనిట్లను శుక్రవారం ఆయన ఎస్ఐ ఎం.వీరబాబుతో కలిసి పరిశీలించారు. బాణసంచా తయారీ యూనిట్ల యజమానులకు సీఐ పలు సూచనలుచేశారు. ఎవరైనా అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నట్టు గానీ, నిల్వ ఉంచినట్టు గానీ తెలిస్తే 9440796555 నెంబరుకు ఫోను చేయాలన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనులను గుర్తించేందుకు గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరం, ఏకే మల్లవరం గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత, ఉద్యాన పంటల సాగు, పశువుల షెడ్లు, మొక్కలు పెంపకం, పుంతరోడ్ల నిర్మాణం తదితర పనులను గుర్తించారు. వేతనదారులు తమ ఈ-కేవైసీని అప్డేట్ చేయించుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీవో గంగాభవానీ కోరారు. లేకుంటే పనులకు హాజరయ్యే అవకాశం ఉండదని చెప్పారు. సర్పంచ్‌లు అరిగెల సత్యనారాయణమ్మ, సుశీల, ఎంపీటీసీలు సుబ్రహ్మణ్యం, ప్రకాష్ పాల్గొన్నారు.

క్లస్టర్ కో-ఆర్డినేటర్‌కు అభినందన

సామర్లకోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన తోట నాగభూషణాన్ని ఉండూరు, పి.వేమవరం, కాపవరం, రావువారి చంద్రంపాలెం, పవర, పండ్రవాడ, నవర గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం కలిశారు. ఆయనకు పుష్పమాలలు వేసి అభినందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకే ధరకు పంటకోత యంత్రాలు రైతులకు అందుబాటులో ఉంచేలా ఎమ్మెల్యే చినరాజప్ప దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా వీరభద్రరావు



సామర్లకోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ సేవా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిఠాపురంలోని సూర్యరాయ గ్రంథాలయ కమ్యూనిటీ హాలులో సంఘ ఎన్నికలు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. శుక్రవారం సాయంత్రం ఆయన్ను సంఘ పట్టణ ప్రతినిధులు పూలమాలలతో ముంచెత్తి అభినందించారు.

ఎంపీ సతీష్‌బాబు ప్రజాదర్బార్‌కు 24 అర్జీలు

సామర్లకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 24 అర్జీలు అందాయి. కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఆనంద్‌న్యూటన్, గింజాల శ్రీనివాసు, జిన్నూరు బాబ్జీ, అవసరాల హరిల్లు, ముత్యాల అనిల్, కొండబాబు, రాజేష్, సురేష్ అర్జీలు స్వీకరించారు. వాటిలో 14 అర్జీలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు.

పిఠాపురం, గొల్లప్రోలుల్లో భారీ వర్షం

పిఠాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం గంట పాటు ఉరుములతో ఏకధాటిగా కురిసిన వర్షం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. తారకరామనగర్, అనఘా దత్త క్షేత్రం, చిట్టోడితోట, మంగాయమ్మరావుపేట, ఆర్టీసీ కాంప్లెక్సు, చర్చి సెంటర్, మెయిన్‌రోడ్డు, విద్యుత్‌నగర్, ఉప్పాడ సెంటర్, పాత బస్టాండు, అంబేడ్కర్ సెంటర్, ఫైర్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయం సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. ఉదయమే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. వర్షంలో తడిసే బస్సులు, ఆటోలు ఎక్కి పాఠశాలలు, కళాశాలలకు చేరుకున్నారు. వర్షం తర్వాత రహదారులపై పొగమంచు ఆవరించింది.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షంతో రోడ్లపై నీరు ప్రవహించింది. 40 నిమిషాలు వర్షం కురవగా తదనంతరం చినుకులు కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది.

రేపటి నుంచి జీఎస్టీ కోకనాడ షాపింగ్ సంబరాలు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలు సామాన్యులకు తెలిసేలా ఆదివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహిస్తున్నట్టు డీఆర్వో వెంకట్రావు తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలోని పైడా చలమయ్య కల్యాణ మండపంలో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఎగ్జిబిషన్‌లో అన్ని ఉత్పత్తులు అమ్ముతారన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి, ఆర్డీవో మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలపై సమీక్ష

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గత నెలలో జరిగిన మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులు సమీక్ష నిర్వహించారు. వాటిని అరికట్టేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తగు సూచనలు చేశారు. గర్భధారణ, బాలింత సమయాల్లో అందజేయాల్సిన సేవలను వివరించి మాతృ మరణాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, జీజీహెచ్ ఎండీఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.రమాదేవి, జీజీహెచ్ గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయషీల తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కటౌట్‌తో ఊరేగింపు



కాకినాడ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కటౌట్‌తో ఊరేగింపు నిర్వహించారు. తొలుత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో చంద్రబాబు కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. స్థానిక పెద్ద మార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, కొడవలి, చేబ్రోలు తదితర గ్రామాల్లోని ఆరుగురు లబ్ధిదారులకు రూ.7.20 లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం వారి గృహాలకు వెళ్లి చెక్కులు అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక స్వామికి పూజలు



గొల్లప్రోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైయున్న వరసిద్ధి వినాయకస్వామికి సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. విశేష అభిషేకాల అనంతరం అలంకారం చేశారు.

ఆరు నెలల్లో తునికి వందే భారత్ : ఎంపీ సతీష్‌బాబు

తుని రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గంలో ఎమ్మెల్యే యనమల దివ్య అభ్యర్థన మేరకు ఆరు నెలల్లో తునిలో వందే భారత్ హాల్ట్ వచ్చేలా కృషి చేస్తానని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు చెప్పారు. తుని మండలం ఎస్.అన్నవరం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో సానా సతీష్‌బాబు మీడియాతో మాట్లాడారు. తునిలో హాల్ట్ కోసం ఎమ్మెల్యే దివ్య ఈ ప్రాంతవాసుల అవసరాలకు అనుగుణంగా ఇటీవల లేఖ అందజేశారని, వచ్చే ఆరు నెలల్లో ఇది కార్యరూపం దాల్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా నియోజకవర్గ వ్యాప్తం గా ఐదుగురికి రూ. 6,02,276 లక్షల చెక్కులను అందజేశామన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్ టీడీపీ నాయకులు గోళ్ల చంటిబాబు, ఏఎంసీ డైరెక్టర్ జొన్నల రాంబాబు, జొన్నల శ్రీనివాస్ కుమార్, కీర్తి గంగరాజు, కొమరం నాగన్నదొర, మాచినేని రాజేష్, మాగాపు బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, బొల్లా పుల్లయ్య, కుంజం తాతాజీదొర, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి : జమాల్‌ఖాన్

చింతూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకున్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని టీడీపీ మండలాధ్యక్షుడు జమాల్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఏడుగురాళ్ళపల్లిలో టీడీపీ నేతృత్వంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ గ్రామస్థులతో మమేకమయ్యారు. ముఖ్యంగా ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని సమస్యలను ఆ గ్రామస్థులు జమాల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ఎండీ జహంగీర్, కణితి వెంకయ్య, జోగారావు, ముర్రం సీతారామయ్య, వల్లాల రెడ్డి, పీ. సాల్మన్‌రాజు, మంగవేణి, భూక్యా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరిస్తాం : ఫ్యాప్టో

చింతూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్టు చింతూరు మండల ఫ్యాప్టో సంఘ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో జీ. వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇకపై తాము బోధనేతర పనులు, విద్యాశక్తి 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమన్నారు. టీచర్లు పండా కృష్ణయ్య, శ్యామల సుబ్బయ్య, బొగ్గ ముత్తయ్య, కర్సం బ్రహ్మయ్య, పూరి జయకృష్ణకుమారి, నాగేంద్ర, ఉదయ్, విల్సన్, పూరి బాబూరావు, సుజాత, కొవ్వాసి భీమయ్య పాల్గొన్నారు.

యువతతో పోలీసులు మమేకం

చింతూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల సమాచారం తమకు చేరవేస్తే, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చింతూరు సీఐ గోపాల కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఏడుగురాళ్లపల్లి సంతకు హాజరైన పోలీసులు అక్కడికి వచ్చిన వివిధ గ్రామాలకు చెందిన యువతతో మమేకమయ్యారు. మావోయిస్టుల సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఆంక్షలు, డిజిటల్ అరెస్టు, తదితర అంశాలపై సీఐ వివరించారు.

చింతూరులో మండల వీవోఏల మహాసభ

చింతూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరులో వీవోఏల మండల మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడారు. వీవోఏలకు పనిభారం తగ్గించాలని, 5 జీ స్మార్ట్‌ఫోన్‌లు సరఫరా చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, కనీస వేతనం చెల్లించాలని వెంకట్ డిమాండ్ చేశారు. చివరిగా మండల వెలుగు వీవోఏల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడుగా బంగారు కొండ, కార్యదర్శిగా గొర్రె లక్ష్మయ్య, కోశాధికారిగా కుర్సం రాధతో పాటు ఎనిమిది మందితో కూడిన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తాటి ఆధారిత ఉత్పత్తులపై అవగాహన

దేవీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దొనలంకలో సర్పంచ్ శివరెడ్డి అధ్యక్షతన శుక్రవారం తాటి ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. తాటి నీర సేకరణ కోసం తాటి పండ్లు సేకరించడం, తాటి తాండ్ర తయారీపై చర్చించారు. తాటి బెల్లం తయారీ విధానం, తాటి తేగ ద్వారా బిస్కెట్ తయారీ, తాంటి తాండ్ర కోసం వివరించారు. 20మంది రైతులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. కార్యక్మంలో అలర్ట్ సంస్థ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం అందజేయాలి

కూనవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా పోలవరం నిర్వాసితులకు పరిహారం అందజేయాలని సీపీఎం నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. పరిహారంలో జాప్యం కావడంతో 18 సంవత్సరాలు నిండిన వారు చాలామంది ఉన్నారని, వారికి ఇప్పుడు పరిహారం లేకపోవడంతో అన్యాయం జరుగుతోందన్నారు. 2022 కటాఫ్ డేట్‌గా నిర్వహించి నోటిఫికేషన్ ఇచ్చారని కానీ ఇప్పటికి మూడేళ్లు దాటిన పరిహారం రాలేదన్నారు. కార్యక్రమంలో తెలగాని నాగరాజు తాళ్లూరి శ్రీను కొండ ఈశ్వర్ పాల్గొన్నారు.

బెదిరించడం సబబు కాదు : సుందరయ్య

కూనవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనేతరులు భూములను సీపీఎంకి చెందిన వారికి కౌలుకి ఇవ్వకపోతే ఆ భూముల్లో జెండాలు పాతుతామని ఆ పార్టీ నాయకులు బెదిరించడం సబబు కాదని బీజేపీ గిరిజన మోర్చ కార్యదర్శి పీ.సుందరయ్య అన్నారు. సీపీఎం గిరిజన సంఘం పేరుతో అనేక ప్రకటనలు విడుదల చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

'నూతన జీఎస్టీపై అవగాహన కల్పించాలి'

మారేడుమిల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవి అన్నారు. శుక్రవారం కుండాడలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మారేడుమిల్లిలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషకుమార్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె దేబొరాసునీత, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, ఎగ్జిబిషన్ స్టాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మనగర్‌లోని తన కార్యాలయంలో నియోజ కవర్గ ప్రజల నుంచి శుక్రవారం వినతులు స్వీకరించారు. తక్షణం అధికా రులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుం దన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, పీలా మహేష్, పెనుమర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీతో సామాన్యులకు మేలు

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలతో సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కమర్షియల్ టాక్స్ కేవీ లక్ష్మీ ప్రసన్న, అసిస్టెంట్ కమిషనర్ నిర్వహించిన కార్యక్రమంలో విజయ ఎంటర్ ప్రైజెస్, శరవణ మొబైల్స్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, వెలుగు సీడీపీవో పూర్ణిమ, ఎంపీడీవో చంద్రశేఖర్, జగ్గంపేట సెక్రెటరీ శివ, జీఎస్టీ ఆఫీసర్ రాజా, ఏఈఓ టీవీ శివరామరావు, ఏపీవో రమణ కుమార్ పాల్గొన్నారు.

రేపు కాళ్ల దొంగబాబు విగ్రహావిష్కరణ

కిర్లంపూడి మండలం చిల్లంగికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దివంగత కాళ్ల దొంగబాబు విగ్రహా విష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు కిర్లంపూడి గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర జరగనుంది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. నెహ్రూ, నవీన్‌కునిర్వాహకులు జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు.

కార్యక్రమం లో నియోజక వర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చదరం చంటిబాబు, క్లస్టర్=ఇంచార్జ్ పారంశెట్టి మురళీకృష్ణ, దొంగబాబు కుమారులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

స్థానిక దేవి సెంటర్లోని లలిత భువనేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రుల సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వ హించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్ నాళం సూరిబాబు, తాండ్రోతు వెంకట రమణ, ఇమ్మిళ్ల రాంబాబు, వైబోగుల కొండబాబు యాదవ్, విజయ ఎంటర్ ప్రైజెస్ శ్రీను, ఇమ్మిళ్లల్ల రాజు పాల్గొన్నారు.

ఎస్.అన్నవరం అభివృద్ధి నా బాధ్యత

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దివ్య



ఎస్.అన్నవరంలో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరం గ్రామ అభివృద్ధి తన బాధ్యత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. రాజ్య సభ ఎంపీ సానా సతీష్‌బాబుతో కలిసి ఎస్.అన్నవరం గ్రామంలో పర్యటించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు ఆచరించి తదనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ సతీష్ బాబు గ్రామానికి రూ.25లక్షలు మంజూరు చేయగా పాత సంచుల వర్తకులు, వర్కర్స్ సంక్షేమ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.అన్నవరం తన పుట్టిల్లు లాంటిదని, తన తండ్రిని ఆదరించిన మాదిరిగానే తనను అక్కున చేర్చుకున్నారని తన గెలుపుతో ఎస్.అన్నవరం గ్రామస్తులు కీలకంగా మారారన్నారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా పాటు పడతానని ఆమె తెలిపారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఎస్.అన్నవరం బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి సానా ఫౌండేషన్ నుంచి రూ.25లక్షలు మంజూరుకు ఎంపీ సతీష్‌బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చింతమనీడి నాగసోమరాజు(అబ్బాయి), పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చోడిశెట్టి గణేష్, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మున్సిపల్ మాజీ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, వంగలపూడి నాగేంద్ర, అప్పన రమేష్ ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

తేటగుంట టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.15,95,779 నగదు చెక్కులను 22 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే యనమల దివ్య టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తొండంగి టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, పంపా ప్రాజెక్టు చైర్మన్ చందు, వెలగా వెంకట కృష్ణారావు, పోడా వెంకటరమణ, గజ్జి అప్పలరాజు, పప్పు నవీన్, సుర్ల బోడియ్య, తమరాన సత్యనారాయణ, రామకృష్ణ ఉన్నారు.

విద్యతో పాటు క్రీడలపై శ్రద్ధ కనబరచాలి

రౌతులపూడి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడలపట్ల విద్యార్థులు శ్రద్ధ కనబరచాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఎ.మల్లవరం రెసిడెన్షియల్ మండల స్థాయి అండర్14, 17 బాలుర, బాలిక ల కబడ్డీ, వాలీబాల్, కోకో సెలెక్షన్‌లను ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారా యణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, లెక్కల రాము, గౌవిరెడ్డి గుర నాథ్, పల్లికుమార్, ఎంఈవోలు సతీష్, కొండ బాబు, పీఈటీలు బర్రే రాజేశ్వరరావు, సత్యనా రాయణ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం మూసివేత

గండేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరంలో ఇటీవల బాణసంచా దుకాణంలో జరిగిన ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. గండేపల్లిలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చాక తెరుస్తారని తెలుస్తుంది.



తేటగుంటలో యనమలను సత్కరిస్తున్న ఆత్మకమిటీ చైర్మన్

మాజీ మంత్రి యనమలకు సత్కారం

తుని రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడికి తొండంగి మండలం పీఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్‌ను ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలుపుతూ తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్డి రాంబాబు, ములికి రామకృష్ణ, పసుపులేటి రామకృష్ణ ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థికి కలెక్టర్ అభినందన



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శరణ్య

శంఖవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కేజీబీవి విద్యార్థి పెద్దిరెడ్డి శరణ్య మూడోస్థానం సాధించింది. శరణ్యను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందించారు. విద్యార్థిని ఎంఈవో ఎస్వీ రమణ, పాఠశాల ప్రిన్సిపాల్ బి.బాలమణికుమారి, సిబ్బంది కె.ప్రశాంతి, రావులపూడి వెంకట అనంతలక్ష్మీ అభినందించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంతకాల సేకరణ

రౌతులపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీపై కాంగ్రెస్ శ్రేణులు రౌతులపూడిలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగం రమేష్ అధ్వర్యంలో పెట్రోల్ బంక్ నుంచి మార్కెట్ సెంటర్ వరకూ ఈ కార్యక్రమం నిర్వహించారు. నీరుకొండ సత్యనారాయణ, సూర్యప్రకాశ్, లోవరాజు పాల్గొన్నారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్



గండేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న అనిల్‌కుమార్ అక్కల ఆంధ్రా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ రవి తంగజన్ తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ జలాది రవి పర్యవేక్షణలో అనిల్‌కుమార్ సమర్పించిన గ్రంథానికి ఇంపాక్ట్ ఆఫ్ ఈ లెర్నింగ్ ప్లాట్ ఫార్మ్ ఆన్ స్టూడెంట్ పెర్ఫార్మెన్స్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఇన్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్నారని తెలిపారు. అనిల్‌ను ఆదిత్య చాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబి శ్రీనివాస్, డాక్టర్ ఎస్. రమాశ్రీ అభినందించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఆదిత్యలో యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజయవాడ పిళ్లయార్ ఆయుర్వేద వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ గ్రంధి సత్యప్రశాంత్ సిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్య సలహాలు, ఆయు ర్వేద పద్ధతిలో జీవనశైలి మార్పులు వివరించారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

కిర్లంపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొక్కండ రామశేష గిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2 రోజులపాటు మండల స్థాయి క్రీడాపోటీలు జరిగాయి. ఎంఈవో టి.జోసెఫ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం రమణ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. అండర్ 14, 17లో చెస్ కిర్లంపూడి హైస్కూల్, అండర్ 14 షటిల్ పోటీల్లో తామరాడ ఎస్ఎల్‌వీఎన్ ఇంగ్లీషుమీడియం స్కూల్, అండర్ 14 సింగిల్స్ షటిల్‌లో కిర్లంపూడి హైస్కూల్ మొదటి స్థానం సాధించింది. అలాగే అండర్ 14 ఖోఖోలో గెద్దనాపల్లి హైస్కూల్, అండర్ 17 ఖోఖోలో కిర్లంపూడి హైస్కూల్, అండర్ 14, 17 కబడ్డీలో కిర్లంపూడి హైస్కూల్ మొదటి స్థానం సాధించింది. విజేతలకు జగ్గంపేట అభివృద్ధి కమిటీ సభ్యుడు చదరం చంటిబాబు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, జిల్లా టీడీపీ నాయకులు తూము కుమార్, కాళ్ల వెంకటేష్ గోల్డ్ మెడల్స్ స్పోర్ట్స్ కిట్స్ బహుమతులుగా అందించారు.

ప్రత్తిపాడులో నిలిచిన రిజిస్ట్రేషన్లు

ప్రత్తిపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఆన్‌లైన్‌లో సమస్య కారణంగా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లకు అంతరాయం కలిగింది. కొనుగోలు, అమ్మకం దారులు ఇబ్బంది పడ్డారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ అధికారి విక్టర్ డానియేల్ మాట్లాడుతూ ఈ సాంకేతిక సమస్య రాష్ట్రవ్యాప్తంగా వచ్చిందని తెలిపారు.

వృద్ధులు, వికలాంగులకు పండ్లు పంపిణీ

ప్రత్తిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రవాణాశాఖ విశ్రాంత అధికారి ఎంసీఆర్ ఫౌం డేషన్ చైర్మన్ మిద్దెం చిన్నారావు తెలిపారు. తన కుమారుడు వీర వెంకటరమణ జ్ఞాపకార్థం నిర్మించిన షెల్టర్ వద్ద వృద్ధులు, వికలాంగులకు, బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు.

బియ్యం బస్తాల పంపిణీ

జగ్గంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):రామవరం రంగవల్లినగర్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఎస్టీ ఎరుకల నిరుపేద కుటుంబాలకు 25 కిలోలచొప్పున బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఎరుకల ప్రజలు పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఐటీడీఏ తక్షణం స్పందించి వారి అభివృద్ధికి తోడ్పడతారని కోరారు. ఏఐఎఫ్ టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కే.సతీష్, నాయకులు దేవి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు

రౌతులపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారుల అభివృద్ధికి రూ.7కోట్లు నిధులు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంజూరు చేసినట్టు టీడీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం మూలగపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ రౌతులపూడి నుంచి శంఖవరం వరకూ మరమ్మతుల నిమిత్తం, బలరామపురం, ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం వరకూ బీటీ రహదారికి నిధులు మంజూరైనట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే సత్యప్రభ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్ర మౌళి ఎంపీ టీసీ సోమరౌతు రవి, లెక్కలరాము, గౌరెడ్డి గురునాధ్, చింతకాయల రాజా పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు

ఏలేశ్వరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం రైతులు, వ్యాపారస్తులకు ఎంతో లాభమని టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిపురం గ్రామంలో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ధనేకుల వీరభద్రరావు పాల్గొన్నారు.

సులభ ధరలకే ఎలక్ట్రానిక్ వస్తువులు

గండేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సులభ ధరలకే ఎలక్ట్రికల్ వస్తువులు లభ్యమవుతున్నాయని గండేపల్లి ఎంపీడీవో హరికృష్ణసత్యారెడ్డి అన్నారు. నీలాద్రిరావుపేట పంచాయతీ ఆవరణలో శుక్రవారం జీఎస్టీ విధానంతో తగ్గిన ఎలక్ట్రికల్ వస్తువుల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎంపీడీవో హాజరై మాట్లాడారు. పలు ఎలక్ట్రికల్ వస్తువులపై ప్రభుత్వం 28శాతం నుంచి 18శాతానికి జీఎస్టీ తగ్గించిందని అవగాహన కల్పించారు. కార్యదర్శి బాల వీరేంద్రచౌదరి తదితరులు ఉన్నారు.

కత్తిపూడి బస్టాండులో సౌకర్యాలు కల్పించండి



ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు వినతి అందిస్తున్న మహిళలు

శంఖవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి బస్టాండులో సౌకర్యాలు కల్పించాలని జనసేన మహిళలు, జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. నిత్యం రద్దీగా ఉండే కత్తిపూడి బస్టాండులో ఆరు దాటితే మరుగుదొడ్లు అందుబాటులో ఉండటంలేదని విద్యార్థులు, మహిళా ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, తుని డిపో మేనేజరుని సంప్రదించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో లక్ష్మణరావు, జర్తా సీత, రాజబాబు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకూ?

● ఎంపీపీ పర్వత రాజబాబు ఆవేదన

శంఖవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని, ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని ఎం పీపీ పర్వత రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. ప్రభుత్వం వచ్చాక అంచ నాలు అయిన పనులను జరగనివ్వకుండా నిలివేశారన్నారు. గడిచిన మూడేళ్లుగా ఎంపీటీసీలకు గౌరవవేతనం కూడా ఇవ్వడం లేదని, ఏడాది కాలంలో నలుగురు ఎంపీడీవోలు మారారని, ఇలా అయితే మండలం ఎలా అభివృద్ధి జరుగుతుందని ప్రశ్నించారు. గౌరవ వేతనానికి ప్రతిపాదనలు పంపామని త్వరలోనే సభ్యులకు అందజేస్తామని ఎంపీడీవో కిషోర్ తెలిపారు. వైస్ ఎంపీపీలు ధారా రమణ, ఈగల చిన్నమ్మలు, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, పిర్ల నాగేశ్వరావు, దడాల సతీష్, గెద్దం రాణీ, కూనిశెట్టి సత్యవతి, సర్పంచిలు శెట్టిబత్తుల కుమారరాజా, కూనిశెట్టి మాణిక్యం, పండు, రాంబాబు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఎటపాక, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): చిననల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. అండర్ 14,17 కబడ్డీ, వాలీ బాల్ ఖోఖో, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, హైజంప్, డిస్కస్ త్రో, తదితర పోటీల్లో నంది గామ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సుధీప్, కేఎన్‌పురం ఆశ్రమ పాఠశాల నుంచి చరణ్, శివమణి, నెల్లిపాక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విశ్వేశ్వర్, నవకాంత్, వివేక్ నాగచైతన్య, పినపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రేవంత్, సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మోజేష్ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.